
# ఝాన్సీ

రూప



గడియారం రాత్రి పన్నెండు గంటలు కొట్టింది. మరింక నిదురరాదు. కళ్ళు మూతలు పడినా పీడకలలు. నిదురపోలేదు. అందరు నిదుర పోతున్న రాత్రి వెంటాడే ఆలోచనల మధ్య ఏమి చేయాలో తోచదు.

అష్టదిగ్గంగా పడినిదురపోతున్నపిల్లలకేసి చూసింది ఝాన్సీ. ఏవో ఏవేవో రూపంలేని ఆలోచనలుచుట్టుముడుతుండగా లేచి కూర్చున్నది. బుర్ర వేడెక్కిపోయింది.

లోపలాక ఝాన్సీ నిత్యం వెంటాడే ఝాన్సీ- నీది ఒక బతుకేనా అని నిలదీసే ఝాన్సీ- బయట ఏమిలేనట్లు అంతా మామూలుగానే ఉన్నట్లు తిరిగే ఝాన్సీ.

ఈ ఇద్దరు సదా పెనుగులాడుతూ వుంటే -పక్కపక్కనే తిరుగుతూ వుంటే- "బతకడమా? చావడమా?" ఆసాయంత్రం ఝాన్సీ ఈ మాట ఎన్నిసార్లు అనుకున్నదో?

ఝాన్సీ లేచినిలబడింది. ఒళ్ళు తూలు తోంది. ఒళ్లంతా నొప్పులు అవి శారీరకమైనవేనా? కాదు కాదంటుంది లోపలి ఝాన్సీ- ఓడిపోవడం యిష్టంలేక బయటి ఝాన్సీ లేచి గ్లాసుతో నీళ్ళు ముంచుకొని తాగింది. నొప్పి - గుప్పుమనే నొప్పి- సలిపే నొప్పి .

వచ్చి పక్కమీద వాలింది ఝాన్సీ. తన గురించిన ఆలోచనలు దూరంగొట్టడానికి - లోపలి ఝాన్సీ నుండి దూరంగా పారిపోవడానికి ఎక్కడివో మరెక్కడివో జ్ఞాపకాలను తవ్విపోసుకుంటోంది.

గంగమ్మ గుర్తొచ్చింది ఝాన్సీకి.

మొగుడు తాగుబోతు. గంగమ్మ ఒక ఎముకల గూడులాగా ఉంటుంది. ఒంట్లో గోరెడు మాంసం లేదు. ఎవరో పూర్తిగా నమిలి పారేసినట్టుగా ఉంటుంది.

గంగమ్మ మొగుడు పగలల్ల బట్టలు ఇస్త్రీ చేస్తాడు. వచ్చిన డబ్బుతో సాయంత్రం తాగుతుంటాడు. భార్య తిండి గురించికాదు. తన తిండికే భార్యమీద ఆధారపడతాడు. గంగమ్మ చింపిరి జత్తు గంగమ్మ. ఒంటి ఊపిరితో అంట్లు తోమి ఇల్లు గడుపుతోంది. ఈ యాతనతోనే బిడ్డ పెళ్ళి చేసింది. అల్లుడు మామకన్నా రెండాకులు ఎక్కువే చదివాడు. కొంతమంది బతుకు అంతేనేమో?

"అట్లాగా" వెటకారంగా అడిగింది లోపలి ఝాన్సీ.


కనురెప్పలు మూతలు పడుతుంటే- నిద్రవల్లనో గొంతులో గురగురలాడే దు:ఖం వల్లనో ఝాన్సీ నిదురబోయింది. ఎప్పటిలాగే ఆరాత్రి అందరిలాగే ఝాన్సీని లాలించింది.

పిట్టల స్వాగతంతో తెల్లవారింది. పిట్టలు కిచకిచలాడడం వింటూనే తప్పదన్నట్లు ఝాన్సీ పని మొదలు పెట్టింది. ఇప్పుడు వంట పాత్రల్లో ఉడికే అన్నంలో ఝాన్సీ కలగల్సి పోతుంది. తన కాళ్ళను తనే తొక్కుకునే ఇంటిపనిలో నొప్పులతోనే లీనమౌతుంది.

పిల్లలను తయారుచేసి బడికి పంపింది.

అత్త మంచంలో ఛాయకోసం ఎదురు చూస్తోంది. తనగొడువలు తనవి. తన వెతుకులాటలు తనవి. తన గొడవలతో ఏది ఏమైనా పెద్దావిడను బాధపెట్టవద్దు.... ఇదేదో కొత్తగా వింతగా ఉన్నట్టనిపించింది. తను సదా అప్రమత్తంగా ఎవరిని బాధపెట్టవద్దనుకుంటూనే ఉంటుంది. అలా ప్రవర్తిస్తూనే ఉంటుంది.

ఝాన్సీకి తన చిన్ననాటి జీవితం గుర్తొచ్చింది. చెట్లెక్కడం, ఆడడం, పాడడం ఇప్పటిలాగా కనిపించని బాధలు బంధాలు లేక ఎంతో బాగుండేది. ఆ బడిపాఠాలు - అంతకన్నా ఎన్నో కబుర్లు చెప్పే స్నేహితులు..




ఝాన్సీ తల్లిగారి కుటుంబం చాలా పెద్దది. తిండికి బట్టకులోటులేని కుటుంబం. ఇల్లు ఎప్పుడు వచ్చిపోయే వాళ్ళతో యమసందడిగా ఉండేది.

ఎప్పుడు అనారోగ్యంతో బాధపడే తల్లి గుర్తొచ్చింది. ఝాన్సీకి లోపలెక్కడో గోరువెచ్చని స్పర్శ అనుభూతమయ్యింది. నాన్న వ్యాపారం, ఎప్పుడు బిజీగా ఉండేవాడు. అమ్మకళ్ళల్లో ఆనాటి బాధఝాన్సీకి ఇప్పుడు అర్ధమౌతోంది. తనను పట్టించుకోవడంలేదని అమ్మ బాధపడేది.

ఝాన్సీకి అమ్మ చావు గుర్తొచ్చింది. అప్పుడు తనకు అర్ధమేకాలేదు. తను ఎనిమిదవ తరగతి చదువుతుండప్పుడు. చావు స్పృహలోకి రాని వయస్సది.

అమ్మపోయిన తరువాత నాన్నకు తెలిసింది. తనకు అమ్మే ఏకైక ఆధారమని- తను ఒంటరివాడినైపోయానని.

ఆడేపాడే ఝాన్సీ- కబుర్లు చెప్పే ఝాన్సీ తప్పనిసరై బడి మాన్పించి వేశారు. ఆచిన్నారి వయస్సులోనే ఎందుకైతేనేమి ఝాన్సీ అమ్మ జాగాలోకి మారింది.

ఔను అప్పటినుండి ఝాన్సీకి రెండు మనసులయ్యాయి. పైకి అందరికి అన్నీ అమర్చే అమ్మపాత్ర. లోలోపల తన గురించి ఆలోచించుకునే మరొక ఝాన్సీ

లోపలి ఝాన్సీ తనదైన పద్ధతిలో ప్రపంచాన్ని అర్థం చేసుకునేది. అన్నింటిని వితర్కించుకునేది. కలలుకనేది. ఝాన్సీకి మోహన్ వాళ్ళ కుటుంబం గుర్తొచ్చింది. ప్రమీలా వదిన గుర్తొచ్చింది.

వంటచెయ్యడం, ఇల్లు సర్దడం, సమస్త విషయాలు ప్రమీలనుండే కదా తను నేర్చుకున్నది. చెల్లెళ్ళను, తమ్ముళ్ళను బడికి పంపి తను తన కలల రెక్కలు వాళ్ళకు తొడిగి తను వంటింట్లోనే ఉండిపోయింది. నాన్నకు తనంటే ప్రాణం.

"ఇంకా ఛాయకాలేదా?" అత్తమాట.

ఝాన్సీ ఉలిక్కిపడ్డది. ఛాయ పొంగి కమురు వాసన వేస్తోంది. "నానుండి నువ్వు దూరం పోలేవు" లోపలి ఝాన్సీ. ఝాన్సీ ముఖంలో పరాకు స్థానే చిరాకు చోటు చేసుకుంది. మిగిలిన ఛాయ గ్లాసులో పోసి అత్తకు యిచ్చి పీడ వదిలిందనుకొని నిట్టూర్చింది.

గడియారం ఎనిమిది కొట్టింది. ఝాన్సీ ఉరుకులు పరుగుల మీద వంటచేసింది. గజిబిజ ఆలోచనలతోనే స్నానం చేసి స్కూలుకు బయలుదేరింది.

ఇంటినుండి కిలోమీటరునడక- చిన్న పల్లెటూళ్ళో బడి- ఈబడికోసం తనెంత పెనుగులాడింది గుర్తొచ్చింది. తనకంటూ జీవితం ఉండాలని ఎప్పుడో మానేసిన చదువు అక్షరాలు కూడబలుక్కున్నది.

ఝాన్సీలాగే అనేకమంది ఆడవాళ్ళు హడావిడిపడుతూ పోతున్నారు. చాలామంది ప్రైవేటుస్కూలు టీచర్లే. అయిదారు సంవత్సరాల కిందటైతే ఒకరిద్దరు మాత్రమే ఉండేవాళ్ళు - ఇప్పుడో?

మూలమలుపు తిరిగి పెద్దరోడ్డు మీద నడుస్తోంది ఝాన్సీ. వచ్చే లారీలు, పోయే లారీలు, ఆటోలు, స్కూటర్లు రోడ్డు యమ సందడిగా ఉంది. పైపుల కంపెనీలో పనిచేసే ఆడకూలీలు చెట్టుకింద గుడిసె హోటల్ ముందు కూర్చుండి తలలో పేలు చూసుకుంటున్నారు. ఏమయ్యింది? సమ్మె చేస్తున్నారా?

ఇప్పుడు తనకన్నీ తెలుస్తున్నాయి. తెలిసిన విషయాలలో తనను తాను సరిపోల్చుకుంటోంది.

ఝాన్సీ రోడ్డుకు బాగా ఎడంగా నడుస్తోంది.

ప్రమీల వదిన మళ్ళీ గుర్తొచ్చింది. ఇప్పుడేం చేస్తున్నదో? ఝాన్సీ స్కూలు టీచరయ్యిందంటే నమ్మగలదా? ఆ కాలంలో ముగ్గురు పిల్లలు, చిన్నజీతం, ఉన్నదాంట్లో ఎలాంటి అవకతవకలేనట్లుగా వెళ్ళదీసేది? ఎట్లా సాధ్యమయ్యేది. వాళ్ళిద్దరు ఎప్పుడు పోట్లాడుకోగా తనుచూళ్ళేదు. కాని ఇప్పుడు తగవులెందుకొస్తున్నట్లు.

ఝాన్సీకి ప్రమీల కట్టుబొట్టు మాటతీరు నచ్చేవి. ఇల్లు సర్దడం దగ్గరినుండి మాటతీరు వరకు తను ప్రమీల వదిన నుండే నేర్చుకున్నది.

తను ఇంటిని నడపడం చూసి తండ్రి గర్వపడేవాడు. ఒకింత బాధపడేవాడు. రేపు అమ్మాయికి పెళ్ళైపోతే ఇంతపెద్ద కుటుంబం దిక్కులేనిదై పోతుందిగదా అని విచారపడేవాడు. దగ్గరలోనే సంబంధాలు వెతికేవాడు. కాని నాన్న అనుకున్నట్టే అయ్యింది. తను ఆ కుటుంబాన్ని విడిచి దూరంగా వచ్చేసింది.

తన పెళ్ళై పదిహేనేండ్లు- కాన్పులు- పిల్లలు- ఆగడబిడలోనే తనుండగానే తండ్రి చనిపోయాడు. కుటుంబం ఎవరికి తోచిన పద్ధతిలో వాళ్ళు విడిపోయారు.

ఝాన్సీ పక్క ఆటోవచ్చి ఆగింది. ఝాన్సీకి ఆటో ఎక్కాలన్పించలేదు. ఇంకా కొంచెం నడిస్తే స్కూలు. పైగా ఇట్లా నడవడమే తనకు యిష్టం.

రాత్రిగొడవెందుకొచ్చిందో అర్థంకాలేదు. ఝాన్సీకి రాత్రి తను తిన్న దెబ్బలు గుర్తొచ్చాయి శరీరంమీద నొప్పులకన్నా లోపలెక్కడో సలిపే నొప్పి.

తనెందుకు గొడవపడుతుంది. తన బతుకు ఎటు పోతున్నదో అర్థం కావడంలేదు. తను అన్నింటితో సర్దుకుపోదామనే అనుకుంటుంది. కాని.......

భర్త మంచిగా ఉన్నట్టే కన్పిస్తాడు. ఒక్కొక్కసారి బాధపెడతాడు. కొడతాడు.

ఉన్నట్టుండి అలా ఎందుకౌతాడో తనకు అర్థంకాదు. పోనీ తన తప్పేమిటో? తెలుసుకుందామనుకున్నా మనసు విప్పి చెప్పడు.

తనకు భర్తకు మధ్య ఏవో ఉన్నాయి. అవి ఉండకూడదని తను చెప్పాలనుకుంటుంది. నా పర్సనల్ విషయాలు నీకు అనవసరం అంటాడు తను. ఈ గొడవల్లో ఎప్పుడు దెబ్బలు తినేది తనే.

దెబ్బలు తట్టుకోలేక ఝాన్సీ అనేకమార్లు ఆత్మహత్య చేసుకోవాలనుకున్నది గుర్తొచ్చింది.

మొగవాడు ఎట్లాగైనా బతుకుతాడు.

కాని పిల్లలు. తను చిన్నతనంలోనే తల్లిని పోగొట్టుకుంది. ఆ బాధేమిటో తనకు తెలుసు. పిల్లలకోసమైనా బతికి తీరాలి.

"ఔను బతికి తీరాలి"- ఝాన్సీకి కొంచెం ధైర్యంగాను వింతగాను అన్పించింది.

రాత్రి ఘర్షణ గుర్తొచ్చింది. ఝాన్సీ మిత్రురాలు రాణి చెప్పినమాటలు గుర్తొచ్చాయి.

"ఝాన్సీ-తల్లిలేని బాధ నువ్వు అనుభవించావు ఆడది ఎట్లుపోయినా - ఏది చేసినా లోకం తప్పుగానే అర్థం చేసుకుంటుంది. అరిటాకు ముల్లు మీద పడినా - ముల్లు అరిటాకు మీద పడినా నష్టపోయేది అరిటాకే. ఆడజన్మ, పాడుజన్మ - నీకు స్కూలుంది - అందులో పిల్లలున్నారు" రాణి గొంతు తనలోపల విన్పించినట్లుగానే

రాత్రి అతను తనను కొడుతుంటే పిల్లలు బిక్కముఖాలు వేసుకొని ఏడుస్తున్నారు. నలుగురిలో తిరిగినవాడు మంచి చెడ్డ చూసినవాడు తనపట్ల ఎందుకిట్లా ప్రవర్తిస్తాడో తెలియదు. కొంతమంది అంతేనేమో? ఊరి బాధలన్నీ అర్థం చేసుకుంటారు. కాని తనతో బతికే - భార్య అంతరంగం అర్థం చేసుకోజాలరు.

ఇట్లా ఆలోచిస్తూ ఝాన్సీ స్కూలుకు చేరుకున్నది. అప్పటికే స్కూలు మొదటి బెల్లు మోగింది. ఝాన్సీ తన ఆలోచనలు కట్టిపెట్టి స్కూల్లోకి అడుగుపెట్టింది.

పిల్లలంతా హడావిడిగా పరుగెత్తుకొస్తున్నారు.

పిల్లలు మోపెడు మోపెడు పుస్తకాల సంచులు, టిఫిన్ బాక్సులు నీళ్ళ బ్యాగులు, ఆయాస పడుతూ ఆందోళన పడుతూ పరుగెత్తుకు వస్తున్నారు.


స్కూలు ముందు నిలుచున్న ఝాన్సీ ముఖం చూసి కొంచెం భయం నటిస్తూ, వోర చూపులు చూస్తూ - ఇంటికి పోదామంటే అమ్మ నాన్న తన్ని తగిలేసి బడికి లాక్కొస్తారు. ఎనిమిది గంటలు కూచోవాలంటే పిల్లలకు వల్లకాదు. అయినా తప్పదు కాక తప్పదనుకొని ప్రార్థనకోసం వరుసల్లో నిలబడుతున్నారు.

పోటెత్తే తన బాల్యాన్ని గుర్తుకు తెచ్చుకుంటూ ఝాన్సీ నిలబడినది. ప్రార్థన అయిపోయింది. పిల్లలంతా క్లాసురూంల్లోకి వెళ్ళిపోతున్నారు.

డ్రెస్సులు వేసుకొని రాని పిల్లలను ఝాన్సీ మందలిస్తోంది. సన్నగా పీలగా ఉన్న వెంకటేశ్ దొంగచూపులుచూస్తూ నిలుచున్నాడు. ఝాన్సీ దృష్టి వెంకటేశ్‌పైన పడనే పడ్డది.

"డ్రెస్సు వేసుకరాలేదు" ఝాన్సీ

వెంకటేశ్ ఝాన్సీ ముఖంలోకి ఎప్పుడు చూడడు. అంత చిన్న వయస్సులోనే లోకానికి ఏదో దాయాలని వాడి తాపత్రయం.




"డ్రెస్సులేదు టీచర్" వెంకటేశ్

"ఎన్నిసార్లు చెప్పాలి నీకు" ఝాన్సీ అయినా వెంకటేశ్ మాట్లాడలేదు. వాడు తనను ఖాతరు చెయ్యడంలేదా?

"మీనాన్నను కుట్టించమని చెప్పు" ఝాన్సీ

"తనకు నాన్నలేడని టీచర్‌కు ఎట్లా చెప్పడం?" వెంకటేశ్ తటపటాయించి-పైకి మాత్రం తల నిలువుగా ఊపి క్లాసురూంలోకి పరుగెత్తాడు.

ఝాన్సీకి నుదుటికి చిరుచెమట పట్టింది. ఈ స్కూల్లోని పిల్లలద్వారా వాళ్ళ తల్లిదండ్రుల బతుకు తెలుస్తోంది. ఎంత వద్దనుకున్నా అందులో తను తల మునకలు కాక తప్పడంలేదు. ఝాన్సీ చీర కొంగుతో చెమట అద్దుకుంటూ క్లాసురూంలోకి పోబోతుండగా-

"అమ్మా మాపిలగాడు ఎట్ల చదువు తండు" ఒకామె వచ్చి అడిగింది.

తన ఆశలన్ని కొడుకు చదువుమీదనే పెట్టుకున్నట్టుగా ఆ కొడుకు చదివి తన కష్టాలు కడతేర్చుతాడన్నట్టుగా ఉందాగొంతు.

దానికి తనేం జవాబు చెప్పగలదు?

"చాలారోజులకి కనిపిస్తివి లక్ష్మి" ఝాన్సీ.

ఆ ప్రశ్నకు జవాబు చెప్పడం ఇష్టం లేనట్టుగా లక్ష్మి "ఏందో పుస్తకం కావాలట. లేసిన సంది ఏడుపే - నాకేమో తెలవకపాయె. వాళ్ళ అయ్య పట్టించుకోకపాయె - సాయంత్రం అయిదయ్యిందంటే పనిమీది కెళ్ళి వచ్చేటప్పుడే తాగచ్చి పండె" -

"తాగుడు బందయ్యిందంటున్నరు కద' ఝాన్సీ.

"ఎక్కడమ్మ సర్కారు సారపోతే కాని గిరిది దొరుకుతంది. నాకేమో ఈ తిప్పలు తప్ప దాయె"

అది లక్ష్మి సాదో తన సాదో - ఝాన్సీకి భయమేసింది. ఎందుకిట్లా కుటుంబాలు ముక్క చెక్కలైపోతున్నాయి? అనే ప్రశ్నను తొక్కిపట్టి పైకిమాత్రం " మీ ఆయన అట్ల చేస్తడని నువ్వుకూడా పిల్లలను పట్టించుకోకపోతే ఎట్లా? సంసారమన్నంక సవాలక్షుంటాయి. సర్దుకుపోవాలె కదా!" చివరిమాట మీద తనకే నమ్మకం చిక్కడంలేదు. తను తెల్లారితే పొద్దుగూకుతే తనకుతానే సవాలక్షసార్లు సర్దిచెప్పుకుంటోంది.

"ఆకాఫీలు ఏంటియో నాకు తెలవదమ్మా - నీకే పైసలిస్తే కొనియ్యి తల్లి!" లక్ష్మికొంగుకు కట్టుకొచ్చిన డబ్బుతీసి ఝాన్సీకి యిచ్చి వెళ్ళిపోయింది.

అంతలోనే ఒక పిల్లవాడు "టీచర్ టీచర్ అంటూ ఎగపోసుకుంటూ క్లాసులోకి పరుగెత్తుకొచ్చాడు.

ఝాన్సీ కుర్చీలో కూర్చున్నది. గిచ్చుకోవడాలు, కొట్టుకోవడాలు -

"ఏమయ్యిందిరా?" ఝాన్సీ

"వెంకటేశ్ బయటకు ఉరుకుతాండు టీచర్" పిల్లవాడు

"ఎవరు ఒకటో తరగతి వెంకటేశేనా?" ఝాన్సీకి ఇందాకా డ్రెస్సు వేసుకరానందుకు మందలించిన విషయం గుర్తొచ్చింది.


"నన్నడుగకుంట ఆరొడ్డువతలకి ఎందుకురుకుతాండు" ఝాన్సీ ఆందోళనతో లేచి బయటకు వస్తూ.

"రోడ్డుకావల వాళ్ళమ్మ ఉన్నది టీచర్ అక్కడికి వురుకుతాండు" పిల్లవాడు.

"వాళ్ల అమ్మా! సరెలే నువ్వు క్లాసులోకిపో.'

ఝాన్సీ వెంకటేశ్ పరుగెత్తడం ఇది మొదటి సారికాదు. చాలారోజుల నుండి వాణ్ని గమనిస్తూనే ఉంది. వాడు ఈ సమయం దాకా పరధ్యానంగా ఉంటాడు. - దేనికోసమో ఎదురు చూస్తున్నట్లు ఉంటాడు. ఝాన్సీ మంచిర్యాల నుండి బెల్లంపెల్లికి పోయే రోడ్డుకవతలకు దృష్టిసారించింది. రోడ్డవతల చింత చెట్ల కింద వెంకటేశ్‌ను బలంగా పుష్టిగా ఉన్న ఒక స్త్రీ ఒళ్ళంతాముద్దులాడుతోంది. మొట్టమొదటి సారిగా తన కొడుకును చూసుకుంటున్నట్లు-

ఆరోజు వెంకటేశ్‌ను స్కూల్లో వేయడానికి వచ్చిన మునలమ్మ వాడికి తల్లితండ్రి లేరని




చెప్పిందే - చిత్రంగా ఉందే

ఝాన్సీ మళ్ళీ వచ్చి కుర్చీలో కూర్చున్నది. నోటు పుస్తకాలు దిద్దడం- పలకల మీద అక్షరాలు పెట్టించడం- పాఠాలు చెప్పడం- అరగంట తర్వాత వెంకటేశ్ రాజాధిరాజులాగా అడుగులో అడుగువేస్తూ వస్తున్నాడు.

ఝాన్సీ "వెంకటేశ్"- ఎంతవద్దనుకున్నా కొంచెం కరుకుగానే పిలిచింది.

ఒక్క నిముషం తలెత్తి చూసి వచ్చి దూరంగా నిలుచున్నాడు. వాడి నోట్లో ఏదో ఉంది. కుడిచెయ్యి పిడికిలి మూసి ఉంది.

"ఎవరురా ఆమె" ఝాన్సీ

"అమ్మ-" వాడు

"మీ ముసలమ్మ నీకు అమ్మలేదన్నది కదరా?"

"ఆ ముసల్ది...." వెంకటేశ్ కోపంగా అన్నాడు.

"సరేలే- అది పెద్దరోడ్డు లారీలు వస్తాయి. అట్టా ఉరకొద్దు. ఆ చేతులదేమిటి?" ఝాన్సీ

వెంకటేశ్ పిడికిలి విప్పి చూయించాడు - పావలబిళ్ళ

"ఒక్కొక్కరికి ఒక్కొక్క చరిత్ర"- ఝాన్సీ నిట్టూర్చి పిల్లలతో కలిసిపోయింది.

సాయంత్రం నాలుగు గంటలయ్యింది. చుట్టీబెల్ మోగింది. పిల్లలంతా బిలబిల లాడుతూ ఇళ్ళకు పరుగెత్తారు.

ఝాన్సీ ఒక్కటే మిగిలిపోయింది. దూరంగా కంకర క్రషర్ చేసే మర్మర ధ్వని- దానికావల పచ్చిక మైదానాలపైన కొండలు- తూర్పువేపు పల్లెటూరు. ఆడమగ పోతూ వస్తున్నారు.

ఝాన్సీకి ఒళ్ళంతా నొప్పిగా ఉంది. ఇంటికి పోవడానికి మనస్కరించలేదు.

పెద్దరోడ్డుమీది నుండి ఎవరో ఒకామె ఝాన్సీ వద్దకు వచ్చి నిల్చున్నది. ఆమె ఎందుకో తటపటాయిస్తోంది.

"ఏం పద్మా బాగున్నావా?" ఝాన్సీ లేని ఓపిక తెచ్చుకొని.

"బాగానేవున్నానక్కా?"

"ఇప్పుడెక్కడుంటున్నవ్?"

"ఏం చెప్పనక్కా! కడుపు చించుకుంటె కాళ్ళమీద పడుతది. అమ్మదగ్గరే ఉంటున్నా నక్కా"

"మరి పిల్లలో-"

"నా దగ్గరే ఉంటున్నారు."

"మీ ఆయనకేదో దుకాణం ఉండేది కదా?"

"తాగుడు బందు చేసినరుగద. దుకాణం లాసైంది. ఇల్లు అమ్మి అప్పులు కట్టి కడుపు చేతపట్టుకొని ఇక్కడికొచ్చినం. నీ దగ్గర టీచర్ పని ఇయ్యగలవా అక్కా" పద్మ కంఠం ముద్దై పోయింది.

"సరె చూద్దాం రేపురా పద్మా"

పద్మ వెళ్ళిపోయింది.

ఝాన్సీ ఇంటిదారి పట్టింది. కాళ్ళు మలుకలు పడుతున్నాయి. పదేపదే తన చుట్టు తనే తిరిగినట్టు లోపలి ఝాన్సీ ఈ ఝుంఝూటం నుండి బయటకు పొమ్మంటుంది.
చావే నయమనుకుంటుంది. కాని ఆడవాళ్ళ చావు కూడా వాళ్ళ చేతుల్లోలేదు. పసిపిల్లలు అనేక సుకుమారమైన బంధనాలు. తెంపుకోలేరు. అట్లని రాజీపడలేరు.

ఝాన్సీ తనకు తెలియకుండానే ఇల్లు చేరుకున్నది. చిందరవందరగా ఉన్న ఇల్లు సర్దసాగింది. ఇందాక ఉద్యోగం కావాలని వచ్చిన పద్మ గుర్తొచ్చింది. తను ఎట్లాగో అట్ల ఈ స్కూలు నిలుపుకోకపోతే పద్మ భర్తకు బ్రాందిషాపు. ఇల్లు అన్ని ఉన్నయన్నరు. కాని ఇట్లైంది. వ్యాపారాలన్నీ ఇంతే - వస్తే రానేవస్తవి. పోతే వున్నదంతఊడ్చుకపోతుంది. రెక్కల కష్టం చాలదా? మనుషులు ఎందుకు అంత ఆపతి పడుతారు. ఇప్పుడు.

పద్మ కనీసం పదికూడా పాసుకాలేదు. అక్షరాలు కూడా సరిగారావు. తనో- ఎట్లా వుంచుకోవాలి.

ఇలాంటి తనవి-తనవి కాని అనేక ఆలోచనలు చేస్తుండగానే డ్యూటీనుండి భర్త వచ్చాడు.

ఒకే కప్పుకింద ఉంటూ కూడా అపరిచితుల్లాగా మెదిలారు. నిన్న జరిగిందానికి తను పశ్చాత్తాప పడుతాడేమోనని ఝాన్సీ ఎదురు చూసింది.

తనదేం తప్పన్నది. ఇట్లా జరుగకుండా చూసుకోవడంలో తనకు మాత్రం బాధ్యతలేదా అన్నట్టున్నది భర్తవాలకం.

పిల్లలు మౌనంగానే ఉన్నారు.

ఎప్పటిలాగే-అనేక రాత్రులల్లాగే ఆరాత్రి గడిచిపోయింది.

* * *

ఝాన్సీ పుస్తకం విప్పి పాఠం చెప్పడానికి సిద్ధపడుతుండగానే పద్మ వచ్చి నిలుచున్నది.

"సరే ఇవాళ నుండే చేరు. నాకొచ్చేదాంట్లో నీకొంచం యిస్త- ఇద్దరం చేసుకుందాం-" ఝాన్సీ తన గొంతుకు తనే ఆశ్చర్యపడినది. తన గురించే కాదు- తను ఇంకొకరికి కూడా కాసంత నీడ చూప గల్గింది.

ఎంత చిత్రం. నిన్న తను బతుక్కు చావుకు మధ్య పెనుగులాడింది. ఈ రోజు

"టీచర్- టీచర్-" మరేదో పిర్యాదు.

" వెంకటేశ్ వాళ్ళమ్మ దగ్గరికి ఉరికిండు టీచర్-"

"నువ్వు పోయి వాన్ని తీసుకురాపో-" ఒక పెద్దపిల్లవానికి పురమాయించింది.

వాడు తుర్రుమని ఉరికిండు.

కొద్దిసేపట్లో వెంకటేశ్ వచ్చాడు. వాడికి చెంపల మీద నీళ్ళు ధారపాతంగా కారుతున్నాయి. వాళ్ళమ్మ నుండి గుంజుకొచ్చినందుకు చాత కాని కోపం వాడి కళ్ళల్లో..

తనేందుకు అలాచేసింది ఝాన్సీనొచ్చుకున్నది. కాని ఆ రోడ్డు ఏద్దైనా ప్రమాదం జరిగితే-వాడు గమనిస్తాడా?

"వద్దని చెప్పితే రోడ్డవతలికి ఎందుకు ఊరుకుతున్నావురా?" ఝాన్సీ

"మా అమ్మపిలుస్తది టీచరొ' వాడు బెక్కుతూనే

"పోనీ మీ అమ్మనే ఇక్కడికి రమ్మనవచ్చు గదా?"

రాదు వాళ్ళ నాయినమ్మ జగడం పెడు తది" ఇంకో పిల్లవాడు.

"అట్లాగా - మీ అమ్మ నాయినమ్మ ఒక్క దగ్గర ఉండరా?"

"వీళ్ళ నాయిన చచ్చిపోయిండు టీచర్- వీళ్ళమ్మ వేరేటాయన ఇంట్ల ఉంటది" ఒకపిల్ల

పిల్లలు అదో విచిత్రమైన వింతైన విషయంగా వాళ్ళ అమ్మ నాయినలు అనుకొన్న మాటలు తాము చెప్పారు.

"పాపం ఎంతయాతన పడుతున్నదో?" ఝాన్సీ మనసు విలవిలలాడిపోయింది.

"అట్లా రోడ్డుదాటి ఉరకొద్దు వెంకటేశ్- బొగ్గులారీలు-బస్సులు ప్రమాదం జరుగు తుంది. మీ అమ్మను ఇక్కడికే రమ్మను" పైకి ఝాన్సీ అంది.

వెంకటేశ్‌ను దగ్గరికి పిలుచుకొని అచ్చం వాడి తల్లిలాగే వాడి తలనిమురాలనుకున్నది. కాని పిల్లలు-ఇక్కడ ఏది చెప్పకోరాదు. ఇక్కడ కూడా వ్యక్తం చేసుకోరాదు.

అర్ధాంతరంగా తనకొడుకును తీసుకపో యినందుకు వెంకటేశ్ తల్లి రోడ్డుకవతల అలాగే నిలబడి ఉన్నది.

పోనీ ఇక్కడికి పిలుస్తే వస్తుందా?

మరో అరగంట గడిచింది. వెంకటేశ్ అమ్మ పోలేదు.

ఒక పెద్దమ్మాయిని పిలిచి "రాజేశ్వరి వెళ్ళి వెంకటేశ్ అమ్మను నేను రమ్మంటున్నానని తీసుకురాపో"-ఝాన్సీ.

తొట్రుపడుతూ-అతి కృతజ్ఞతతో- తను అనుభవిస్తున్న క్షోభ తెలిసిపోయిందనో? రకరకాల భావాలు ముఖంమీద దోబూచు లాడు తుండగా వెంకటేశ్ తల్లి వచ్చి ఎండలో కాస్త దూరంలో నిల్చున్నది.

ఝాన్సీ తనకన్ని తెలుసనన్నట్లుగా - ఆస్థితులన్నీ తన కర్ధమౌతాయని ఆ దు:ఖం తను చిన్నప్పటి నుండి ఎరిగిందే అన్నట్లుగా చూసింది. కాని అది వ్యక్తం కాకూడదు. తెచ్చిపెట్టుకున్న టీచర్ వేషంతో, ఏదో చెప్పాలనుకుంది ఝాన్సీ.

"అమ్మా నాకొడుకే రావద్దన్నరట" వెంకటేశ్ అమ్మ గబగబ అంది. ఝాన్సీ ఏమి మాట్లాడ లేక పోయింది.

వెంకటేశ్ అమ్మను చూస్తుండి పోయింది. మంచి శరీరం కాయకష్టంతో తీర్చిదిద్దినట్లుగా ఉంది. ఉండీ లేనట్లుగా అలంకరించు కున్నట్లుగానే ఉంది. కొంచెం నలుపే అయిన ఆకర్షనీయమైన ముఖం. చెప్పరాని బాధల్లోనే ఉన్నట్లున్నా - ఏదో తెగింపు కూడా ఉంది. అటు రీతిరివాజులకు - తల్లి ప్రేమకు మధ్య నిత్యం పెనుగులాడుతున్నట్లుగా ఉంది. తనకు అర్థంకాని వేవో మరేవో తను సాధించి నట్లుగానే ఉన్నది.

ఝాన్సీ తన అంతరంగం చదువుతున్నం దుకు తత్తరపాటుతో "వెంకటేశ్ నా కొడుకే నమ్మా నేను అంగన్ వాడిలో పని చేస్త" అన్నది వెంకటేశ్ తల్లి.

"సరే! చూడాలనుకున్నప్పుడు వెంకటేశ్‌ను ఇక్కడికే వచ్చి చూసిపో" ఝాన్సీ తేరుకుంటూ.

"మాఅత్త నిన్ను తిడుతుందేమొ? వాన్ని నేను ఎత్తుకపోతానని భయం" వెంకటేశ్ తల్లి.

"అదంతా నేను చూసుకుంటాలె" ఝాన్సీ.

వెంకటేశ్ తల్లి ముఖం జేవురించింది.

వెనక్కి తిరిగి తిరిగి చూస్తూ వెంకటేశ్ తల్లి వెళ్ళిపోయింది.

భర్త పోయిన తరువాత వేరే అతనితో ఉంటుందంటే వాళ్లు ఎన్ని అంటున్నారో? ముసలమ్మకు ఏ ఆధారం లేక ఈపసి పిల్లవాన్ని ఉంచుకున్నదా? లోకానికి భయ పడతుండా తెగించిన వెంకటేశ్ తల్లి. తల్లి ప్రేమ దగ్గర తల్లడిల్లుతోంది. లోకరివాజును తెంపుకో గల్గింది కాని తల్లి ప్రేమను తెంచుకో లేక పోయింది. ఎంత చిత్రమైన బంధనాలు.

వెంకటేశ్ తల్లి అనుభవించిన జీవితం ముందు యాతన ముందు తన యాతన చాలా మామూలుగా కన్పించింది ఝాన్సీకి.

వెంకటేశ్ తల్లి మీద ఝాన్సీకి చెప్పరాని ప్రేమ కల్గింది. దాన్ని విశ్లేషించుకోవడానికి ఈసారి లోపలి ఝాన్సీ ఎందుచేతనో భయ పడ్డది.

☆

